క్లుప్తంగా

గురుకులాల డీసీఓకు సన్మానం


డీసీఓ ఐ.శ్రీదేవిని సన్మానిస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి ఉత్తమ డీసీఓగా ఎంపిక కావడం అభినందనీయమని ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక సీ క్యాంప్‌లోని కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో డీసీఓ శ్రీదేవిని సంఘం నేతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న టేకూరులోని విద్యాలయంలోని 33 మంది విద్యార్థుల్లో 8 మంది మెడికల్ సీట్లు, మిగతా 25 మంది దేశంలోనే పేరొందిన యూనివర్సిటీల్లో ఐఐటీ సీట్లు సాధించారన్నారు. డీసీఓ శ్రీదేవి మాట్లాడుతూ తనకు దక్కిన గౌరవం మరింత బాధ్యతను పెంచిందన్నారు. మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి


జేసీ నవ్య, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్‌తో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జేసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ డాక్టర్ నవ్య సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు, జిల్లాలోని గ్రంథాలయ శాఖల్లో చదువుకొని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జేసీ సన్మానించి అభినందనలు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన 21 మందిని ఎవరెవరు ఏ పోస్టుకు ఎంపికయ్యారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ.. నిరుద్యోగులు, ఉద్యోగార్థులు, పాఠకులకు అనువుగా గ్రంథాలయాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని 22 మంది పోలీస్, ఒక్కరు గ్రూప్-2, 21 మంది ఉపాధ్యాయ పోస్టులు సాధించారన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, గ్రంథాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

13న విజ్ఞాన సదస్సు


కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని ఎంపీపీ సమావేశ భవనంలో జోన్ -5 రాయలసీమ జిల్లాల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు చెప్పారు. సోమవారం స్థానిక మీడియా పాయింట్ వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పూలే - అంబేడ్కర్ ఆశయ సాధన కోసం రాజకీయ స్పృహ, సామాజిక బాధ్యత కలిగిన విద్యావంతులైన మేధావులతో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది డాక్టర్ రఘు మల్లేపల్లి హాజరవుతున్నారన్నారు. వెనకబడిన కులాలను రాజకీయంగా చైతన్యం చేసేందుకు జరుగుతున్న ఈ విజ్ఞాన సదస్సుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. నాయకులు కే.వెంకటేష్, రాజీవ్‌కుమార్, రామశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఓర్వకల్లు: రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను నిర్ణీత ధరలకే విక్రయించాలని విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఓర్వకల్లు మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మధుమతితో కలిసి ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులకు కేటాయించిన ఎరువుల రకాలు, విక్రయాలు, మిగిలిన నిల్వలపై వివరాలు తీసుకున్నారు. మొత్తం రికార్డులు సక్రమంగా ఉన్నప్పటికీ, శనివారం విక్రయాల వివరాలు నమోదు చేయలేదని గుర్తించారు. దీనిపై ప్రశ్నించగా ఆదివారం సెలవు కారణంగా రికార్డుల్లో చేర్చలేకపోయినట్లు డీలర్లు తెలిపారు. ఎరువుల వివరాలు నమోదు పూర్తయ్యే వరకు విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహానంది: మహానంది మండలం గోపవరం గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సివిల్‌సప్లై అధికారులు సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. సుమారు 250 బస్తాల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వపై కేసు నమోదు చేసి అధికారులు విచారణ చేపట్టారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- ఇమామ్, మౌజమ్‌లకు పెండింగ్ గౌరవ వేతనాలు చెల్లించాలని ఆందోళన
- 'ఉచిత బస్సు ప్రయాణం'తో నష్టపోతున్న తమను ఆదుకోవాలని ఆటోడ్రైవర్ల ధర్నా
- మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇస్తే ఒప్పుకోమని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లను ఖాళీ చేయడానికి కొంత సమయం ఇవ్వాలని బాధిత కుటుంబాల నిరసన
- గుంతకల్లు రైల్వే ఎస్ఐ మోసం చేశాడని డోన్‌కు చెందిన పూజిత ఆందోళన


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ సభ్యులు



ఆందోళన చేస్తున్న డోన్‌కు చెందిన పూజిత తదితరులు


ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కలెక్టర్ కార్యాలయం ధర్నాలు, నిరసనలు, ఆందోళనలతో సోమవారం దద్దరిల్లింది. ప్రభుత్వం మొండిగా ముందుకెళుతూ ప్రజా సమస్యలపై స్పందించకపోవడంతో ఆయా వర్గాల వారు నిరసన గళం విప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటెద్దు పోకడలతో మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్, ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు, గుంతకల్ రైల్వే ఎస్ఐ మోసం చేశారని డోన్‌కు చెందిన పూజిత అనే మహిళ, ఏబీసీ క్యాంపు క్వార్టర్లలో ఉన్న వారు ఖాళీ చేయడానికి కొంత సమయం కావాలని బాధిత కుటుంబాల ఆందోళనలతో కలెక్టరేట్ పరిసరాలు హోరెత్తాయి.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఒప్పుకోం

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం శోచనీయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓలు 107, 108లను వెంటనే రద్దు చేయకపోతే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం అయితే యాజమాన్యాలు సీట్లను అమ్ముకొని కొట్లు సంపాదించుకుంటాయన్నారు. అదే సమయంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు సీట్లు రావన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసరించుకోకపోతే పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు. నాయకులు అభి, అశోక్, వరుణ్, సాయి, అంజి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భర్త నుంచి కుమారుడిని అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలి

కుమారుడిని ఏడేళ్ల నుంచి తనకు కాకుండా చేసిన భర్త గుంతకల్ రైల్వే ఎస్ఐ సురేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డోన్‌కు చెందిన పూజిత, ఆమె కుమార్తె రమ్య కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగింది. వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన ఎం.సురేష్‌బాబుతో 2016లో పెళ్లి అయిందని, తన భర్త గుంతకల్ రైల్వేలో ఎస్‌బీ ఎస్ఐగా పనిచేస్తున్నట్లు చెప్పారు. తమ కాపురం ఐదేళ్ల పాటు పచ్చగా సాగిందని, కూతురు, కుమారుడు పుట్టారని, అయితే భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని 2021లో తనతో విడిపోయాడన్నారు. ఆ సమయంలో మూడేళ్ల వయసున్న కుమారుడు ఉజ్వల్‌ను కూడా తీసుకెళ్లారని, ఇప్పటివరకు తన కుమారుడిని చూపడం లేదన్నారు, గుత్తి కోర్టు కుమారుడిని తనకు అప్పగించాలని ఆదేశాలు ఇచ్చినా పోలీసులు అమలు చేయడంలేదని, తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరింది.

గుడిసెలు వేసుకున్న వారికి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి

కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీలో రెండు సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి వెంటనే కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. వెంటనే అక్కడ నివాసం ఉంటున్న 600 కుటుంబాలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోతే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలం ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఈ క్రమంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారిని వేధించడం తగదన్నారు. కార్యక్రమంలో మనోహర్ మాణిక్యం, నాగరాజు, గిడ్డమ్మ, సురేష్, భద్రకుమార్ పాల్గొన్నారు.

● ఆటోలతో డ్రైవర్ల ర్యాలీ


నిరసన ర్యాలీ చేపట్టిన ఆటోడ్రైవర్లు

స్త్రీ శక్తి పథకంతో తామంతా నష్టపోతున్నామని చెప్పేందుకు ఆటో డ్రైవర్లు వినూత్నంగా ఆటోల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోడ్రైవర్లకు బాడుగలు లేకుండా పోయాయన్నారు. ఆటో సవారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్న డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నెలకు రూ.12 వేలు జీవన భృతిగా ఇవ్వాలని కోరారు. మరోవైపు ఉబర్, ఓలా తదితర యాప్‌లను రద్దు చేయాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● ఏబీసీ క్యాంపు క్వార్టర్ల బాధితుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఏ, బీ, సీ క్వార్టర్స్ నివాసితులు

ఉన్న ఫలంగా తమను ఖాళీ చేయాలని వేధించడం అన్యాయమని ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లలో అనుమతి లేకుండా నివాసం ఉంటున్న బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సోమవారం వారు నివాసం ఉంటున్న గృహాలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించి కరెంట్ లేకుండా చేయడం, నీళ్ల సరఫరాను బంద్ చేయడంతో మహిళలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ.. తమకు టిడ్కో గృహాల్లో నివాసాలు ఉన్నాయని, వాటిలోకి ప్రవేశించే వరకు గడువు ఇవ్వాలని కోరారు. ఎవరి కోసమో తమను ఉన్న ఫలంగా ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం అన్యాయమని వాపోయారు.

ఉల్లి రైతులపై కక్షగట్టిన ప్రభుత్వం


మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి రైతులకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఆమె సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ.. ఉల్లి కింటాకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1200 మద్దతు ధర ఏ మాత్రం గిట్టుబాటు కాదని, రూ.2400 ధర ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిగడ్డలు కొనుగోలు చేసి రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఇప్పుడు వ్యాపారులు కొన్న ధరను మినహాయించి డిఫరెంట్ అమౌంటు ఇస్తామని చెప్పి కొనుగోలు చేస్తోందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకం రైతులకు లేదన్నారు. వ్యత్యాసం అమౌంటు రాదనే భయం ఉంటే మార్కెట్ యార్డులోనే రైతుల కోసం దీక్ష చేస్తామన్నారు. ఏఐసీసీ సభ్యులు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మినరసింహా, మాజీ ఎంఎల్‌సీ సుధాకర్‌బాబు, మాజీ మంత్రి మారెప్ప, పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి




మాట్లాడుతున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: ఇంజినీరింగ్ విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు లేటరల్ ఎంట్రీ ద్వారా ద్వితీయ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులంతా వర్సిటీలో గడిపే అమూల్యమైన సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కొత్తగా నెలకొల్పిన కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌తో పాటు ఏఐ ల్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. పరిశ్రమల్లో పనిచేయడానికి అవసరమైన నైపుణ్యాలను సాధించాల్సిన విధానాలను శ్రీరాయలసీమ ఆల్కలీస్ అండ్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. సాంకేతిక విద్యలో మహిళల ప్రాధాన్యత మరింత పెరగాల్సిన అవసరముందని మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

తక్కువ ఉత్తీర్ణత శాతంపై అనుమానాలు

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్‌లో తక్కువ ఉత్తీర్ణత శాతంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు సుమారు 20 మంది సోమవారం వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడును కలిసి బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలపై చర్చించారు. ఫలితాలపై తమకు అనుమానాలున్నాయని, ఇంత తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. 50 శాతం మంది విద్యార్థులు కూడా ఉత్తీర్ణత కాలేదంటే లోపం ఎవరిది? కావాలనే ఇలా చేస్తున్నారని, అడ్మిషన్లు తగ్గిపోవడానికి వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు కారణమవుతున్నారని వాపోయారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ పీజీ చదివిన విద్యార్థి బీఈడీ ఇంగ్లిష్ మెథడ్స్‌లో, ఎమ్మెస్సీ చదివిన విద్యార్థి సైన్స్ మెథడ్స్‌లో ఫెయిల్ కావడంతో తమకు అనుమానాలున్నాయని వీసీకి వివరించారు. విద్యార్థుల సమాధాన పత్రాలను ఓపెన్ వాల్యుయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. ఫలితాలు విడుదలైనట్లు గానీ, ఫలితాల శాతం ఎంతో కూడా తెలియకుండా చేస్తున్నారన్నారు. రీ వాల్యుయేషన్ ఒక పేపర్‌కు రూ.300 ఉండగా దాన్ని రూ.500కు పెంచడం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడమేనన్నారు. సమాధాన పత్రాల వాల్యుయేషన్‌లో ఎలాంటి లోపాలు లేవని ఉత్తీర్ణత 58 శాతం ఉందని వీసీ, రిజిస్ట్రార్‌లు వివరించారు. సమాధాన పత్రాలను ఓపెన్ వాల్యుయేషన్, వెరిఫికేషన్ చేసే ప్రక్రియ వర్సిటీలో లేదని, పరీక్షల విభాగం అధికారులు సెలవులో ఉన్నారని మరోసారి వర్సిటీకి వస్తే చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు తప్పనిసరిగా సమతుల ఆహారం తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. సోమవారం స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బాలింతలు, గర్భిణులకు రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనతను గుర్తించడం, నివారణ చర్యలు, సమతుల ఆహారం తీసుకోవడం గురించి వివరించారు. తృణధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసాహార ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవాన్నారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను, పోషకాహార లోపంతో ఉన్న వారిని గుర్తించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పౌష్టికాహార పునరావాస కేంద్రంలో చేర్పించాలన్నారు. వీరికి 12 రోజుల పాటు అక్కడ పోషకాహారం అందించి ఇంటికి పంపిస్తారన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో సోమవారం ఫిజియోథెరపీ విభాగాన్ని ఎండీ డాక్టర్ జి.సుధాకర్, సీఓఓ డాక్టర్ సునీల్ సేపూరి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ విభాగం ఉండటం వల్ల రోగులు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సీఓఓ డాక్టర్ సునీల్ సేపూరి మాట్లాడుతూ ఫిజియోథెరపి సేవలే గాకుండా చైల్డ్ డెవలప్‌మెంట్ యూనిట్‌లో మాటలు రాని పిల్లలకు, చెవుడు, మూగ సమస్యలు ఉన్న చిన్నారులకు ఆధునిక సేవలు అందుతున్నాయన్నారు. కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సబ్ డివిజన్‌లో ప్రస్తుతం యూరియాకు ఎలాంటి కొరత లేదని ఎన్‌చార్జ్ ఏడీఏ ఎల్.శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. సబ్ డివిజన్‌లోని కర్నూలు, కల్లూరు, గూడూరు, సీ.బెళగల్, ఓర్వకల్, కోడుమూరు మండలాల్లో తగినంత యూరియా అందుబాటులో ఉందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 121.9 టన్నుల యూరియా ఉందని, ప్రయివేటు డీలర్ల వద్ద 439 టన్నులు ఉందని పేర్కొన్నారు. డీలర్ల దగ్గర కర్నూలు మండలంలో 77.73 టన్నులు, కల్లూరు మండలంలో 85.26 టన్నులు, కోడుమూరు మండలంలో 55 టన్నులు, గూడూరు మండలంలో 71 టన్నులు, సి.బెళగల్ మండలంలో 171 టన్నులు, ఓర్వకల్ మండలంలో 102 టన్నులు ఉందని వివరించారు. మోతాదు మేరకే యూరియా వినియోగించాలని రైతులకు సూచించారు. నానో యూరియా అందుబాటులో ఉందని, పైపాటుగా వినియోగించవచ్చని తెలిపారు.

కిడ్నీలో 5 సెం.మీ. రాయి

కర్నూలు (హాస్పిటల్): కిడ్నీలో 5.1 సెం.మీ. రాయి ఏర్పడటంతో తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతున్న మహిళకు లాప్రోస్కోపీ ద్వారా రాయిని తొలగించి వైద్యులు ఉపశమనం కలిగించారు. వివరాలను సోమవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో యూరాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ సమద్ వివరించారు. నందికొట్కూరుకు చెందిన సుజాత అనే 57 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో జూన్ 8న హాస్పిటల్‌కు వచ్చింది. ఆమెకు సీటీ స్కాన్ చేయగా కుడి వైపు కిడ్నీలో 5.1 సెం.మీ, 1.6 సెం.మీ రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ముందుగా మెడికల్ చికిత్స అందించిన అనంతరం సిస్టోస్కోపీ, యురెత్రోస్కోపీ, కుడివైపున డీజే స్టంటింగ్ చేశారు. అనంతరం ల్యాప్రోస్కోపీ ద్వారా కిడ్నీలో రాళ్లను విజయవంతంగా తొలగించారు. డిశ్చార్జ్ చేసి ఒక నెల చికిత్స అందించారు. తాజాగా ఆమె ఆసుపత్రికి రావడంతో పరీక్షించి పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధారించుకున్నారు. హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కిడ్నీలో పెద్ద రాళ్లుంటే దశల వారీగా ఆపరేషన్ అవసరం లేకుండా ల్యాప్రోస్కోపీ ద్వారా తొలగించవచ్చన్నారు.

సంక్షిప్తం

యార్డులో 24 షాపుల నిర్మాణానికి తీర్మానం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని చైర్మన్ గొల్కొండ అఖ్మతీ సూచించారు. సోమవారం మార్కెట్ కమిటీ పాలక వర్గం మొదటి సమావేశంలో తన చాంబరులో జరిగింది. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి ముందుగా యార్డు ఆదాయ, వ్యయాలను వివరించారు. కూరగాయల మార్కెట్‌లో 24 షాపులు నిర్మించేందుకు పాలకవర్గ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి విక్రయాలు జరుగుతున్నాయని, ఉల్లి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని, ఈ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, పాలక వర్గం సభ్యులతో పాటు సీనియర్ అసిస్టెంటు కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


10 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.రాఘవేంద్ర ఎంపికయ్యారు. సి.బెళగల్‌లోని ఏపీ ఎస్‌బ్ల్యూఆర్ విద్యాసంస్థల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్న ఆయన్ను ఇంటర్మీడియెట్ బోర్డు ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా నియమించింది. సోమవారం స్థానికంగా స్టేడియంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఆర్చరీ, సెపక్‌తక్రా, ఘూట్కా, 11వ తేదీ ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫుట్‌బాల్, 12వ తేదీ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఫెన్సింగ్, కురాష్, ఉషూ, 13న సైక్లింగ్, కరాటే, మాల్కంబ్, సాఫ్ట్ టెన్నిస్, 15వ తేదీన జూడో, కలియరపట్టు, నెట్‌బాల్, రైఫిల్ షూటింగ్‌ను (అశోక్‌నగర్‌లోని ఆర్‌కే అకాడమీ) నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జనవరి 2007 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, పదో తరగతి మార్కుల జాబితాతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94408 64732 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పార్కును అభివృద్ధి చేయండి

కర్నూలు టౌన్: నగరంలోని 46వ వార్డు పాలకొట్టాల వద్ద పార్కులను అభివృద్ధి చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు శివనాగిరెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు కెరీర్స్ పోర్టల్‌లో ఉద్యోగ సమాచారం


కర్నూలు కెరీర్స్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): నిరుద్యోగ యువత కర్నూలు కెరీర్స్ పోర్టల్‌ను (mykurnool.ap.gov.in) సద్వినియోగం చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. సోమవారం స్థానిక తనీష్ కన్వెన్షన్ హాలులో వాణిజ్య అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. కర్నూలు కెరీర్స్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు ఉంటాయన్నారు.

అభివృద్ధి పనులు చేస్తున్నారా?

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదని, అసలు మున్సిపల్ అధికారులు పనిచేస్తున్నారా? అని మంత్రి టీజీ భరత్ ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం పనిచేస్తుందా?.. రహదారి విస్తరణ పనులు ఎంత వరకు వచ్చా యి. దుకాణాలు, ఇళ్లకు సంబంధించి నష్టం అంచనా వేశారా? టీడీఆర్ బాండ్ల పరిస్థితి ఎంత వరకు వచ్చిందంటూ మున్సిపల్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవార పేట మెడికల్ కళాశాల మలుపు విస్తరణ, కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మంత్రి సీరియస్ అయ్యారు. కమిషనర్ విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు నంబర్లు వేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: నన్నూరులో పేదలకు మంజూరైన ఇళ్ల స్థలాలకు వెంటనే గుర్తింపు నంబర్లు వేసి, లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 15 నెలలైనా నంబర్లు వేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. లబ్ధిదారుల నుంచి ఆధార్, రేషన్ కార్డులు తీసుకున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పించగా, 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు మధుసూదన్, నాగన్న, మల్లేష్, రామకృష్ణ, ఆకుల మధు, రామాంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.